క్లుప్తంగా

ఏఈవో కుటుంబాన్ని ఆదుకుంటాం



సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న తలే రాజేష్

వంగర: రాజాంలో అగ్రికల్చర్ విస్తరణ అధికారి(ఏఈవో)గా పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని ఎం.సీతారాంపురానికి చెందిన గొర్లె సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఆదివారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం



ఆన్లైన్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు

రాజాం సిటీ: జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తున్నామని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో చేపడుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆదివారం పరిశీలించిన ఆయన ప్రతీ లబ్ధిదారుని ఇల్లు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



ఖండ్యాంలో సాగు చేస్తున్న పామాయిల్ తోట

రేగిడి: మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లోని రైతులు పామాయిల్ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పామాయిల్ తోటలు ప్రస్తుతం పూత దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రాయితీతో కొత్తగా తోటలు వేస్తున్నారు. మూడేళ్లకే పూత దశకు చేరుకునే ఈ పంట 25 ఏళ్ల పాటు రైతుకు ఫలసాయం అందిస్తుందని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.

రూ.25 లక్షలతో జల్జీవన్ మిషన్ పనులు



లక్ష్మీపురంలో కొత్తగా నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

రాజాం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో జల్జీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పైపులైన్ల ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తామని ఆర్డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు తెలిపారు. సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థినితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, చదివించడం చేయించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా చాలా మంచి విషయాలు తెలుస్తాయని, అలాగే జ్ఞానం వస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మహిళలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వంగర: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ముఖర్జీ అధ్యక్షతన ఆదివారం జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించి, ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే సీఎం జగన్మోహన్రెడ్డి లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల డ్వాక్రా సంఘాల్లోని 80 లక్షల మంది మహిళలకు రూ.25 వేల కోట్ల మేర రుణ మాఫీ చేశారన్నారు. ఎన్నికల సమయంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీని ఆయన చిత్తశుద్ధితో నెరవేర్చారన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని మహిళలంతా ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. అన్నివర్గాల అభ్యున్నతి కోరే ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అన్నారు. చంద్రబాబుది దోచుకునే విధానమని, మన జగనన్నది పంచిపెట్టే విధానమన్నారు. ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. టీడీపీకే భవిష్యత్ లేదని, రాష్ట్రానికి చంద్రబాబు ఏమి గ్యారంటీ ఇవ్వగలడని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసే నైజం చంద్రబాబుది అని విమర్శించారు. సీఎం జగనన్న మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని, ఇప్పటివరకు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ఆయన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాజాం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తలే రాజేష్ను, ప్రకటించాల్సిన ఎంపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. అనంతరం వంగర మండలంలోని స్వయం సహాయక సంఘాలకు సంబంధించి, రూ.5.70 కోట్ల వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కును ఆయన మహిళలకు అందజేశారు.

ప్రతీ మహిళ కళ్లల్లో ఆనందం..

సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతీ మహిళ కళ్లల్లో ఆనందం చూస్తున్నామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సభలో మహిళలను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించిన ఆయన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేశారు. అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా పథకాలు అమలు జరుగుతుంటే ఎల్లోమీడియా, ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి..

రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. దేశంలో ఎక్కడా అమలు చేయనన్ని పథకాలు మనరాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. సుపరిపాలన అందించిన సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు.

అవినీతి రహిత పాలన..

రాష్ట్రంలో సీఎం జగన్మోహన్రెడ్డి అవినీతి రహిత పాలన కొనసాగిస్తున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్ అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు పారదర్శకంగా నేరుగా ప్రజల వద్దకే చేరుతున్నాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ప్రభుత్వ సేవలు దరిచేర్చారన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కె. ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, పీడీ కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో బాలసుబ్రహ్మణ్యం, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి, ఎంపీటీసీ కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా సభకు హాజరైన మహిళలు

ఆర్థికంగా అభివృద్ధి చెందాం..



జగనన్న పాలనతో నేను, మా కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాం. నా భర్త శ్రీనుతో పాటు నేను ఉన్నత చదువులు చదువుకున్నాం. ఉపాధి లేక వలస వెళ్లిపోవాలన్న తరుణంలో 2019లో జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. వైఎస్సార్ ఆసరా పథకం రూపంలో రూ.20 వేలు, పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.9.90 లక్షలు, సీఐఎఫ్ ద్వారా రూ.1.50 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.1 లక్ష అందుకున్నాం. ప్రభుత్వం అందించిన రూ.10 లక్షల రుణంతో మినపగుళ్ల తయారీ యూనిట్, మాప్స్టిక్స్(తుడుపుకర్రల) యూనిట్లు పెట్టి, నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాం.

– లగ్గు మౌనిక, శ్రీరాజులమ్మ ఎస్హెచ్జీ సభ్యురాలు, కొప్పర, వంగర మండలం.

పంట తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



చార్టు ద్వారా పంట తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: పంటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం సెంచూరియన్ వర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు ఎల్.దుర్గాప్రసాద్, పి.ఆదిత్య, వి.వ్యాఘ్రేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని వీఆర్ అగ్రహారం, మొగిలివలస, పొగిరి గ్రామాల్లోని రైతులకు వివిధ పంటలకు సోకే తెగుళ్లు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అన్నిరకాల పంటలకు తెల్లదోమ తెగులు సోకుతోందని, రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలించి, తెగులు సోకినదీ.. లేనిదీ..గమనించాలన్నారు. సకాలంలో నివారణ చేపడితే పంటను కాపాడుకోవచ్చన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.సందీప్కుమార్



విద్యార్థులకు అట్టలు అందజేస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సందీప్కుమార్

బొబ్బిలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.సందీప్కుమార్ సూచించారు. స్థానిక పట్టణంలోని బీసీ విద్యార్థుల వసతిగృహంలో పదో తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులు ఆదివారం నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా రివిజన్ చేయాలని, ఏదైనా సబ్జెక్ట్లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. పరీక్షలంటే భయపడకూడదని, బాగా చదివితే బాగా రాయగలమన్న విశ్వాసం వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సహాయ అధికారి ఎ.శ్యామలాకుమారి, వసతిగృహం సంక్షేమాధికారులు డి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.దాసు, ఎన్.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భోగి గౌరి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై చర్చించే అవకాశం ఉందన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



వంగర: బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

వంగర: దీర్ఘకాలిక వ్యాధులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో మండలంలోని బంగారువలస గ్రామానికి చెందిన మిరియాల అశోక్కు మంజూరైన రూ.1.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును జెడ్పీ చైర్మన్ చేతులమీదుగా ఆదివారం అందజేశారు. పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్మోహన్రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశం కల్పించారని, దీంతో పాటు సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల కోసం సాయమందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్, సర్పంచ్ సాదెం లలితకుమారి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని గడిముడిదాం గ్రామానికి చెందిన కల్లేపల్లి తిరుపతిరావుకు మంజూరైన రూ.1 లక్ష సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్ చేతులమీదుగా ఆదివారం అందజేశారు. అనారోగ్యం కారణంగా తిరుపతిరావు గత కొన్నాళ్లుగా పలు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతూ వస్తున్నారు. అతడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం కోరగా, తక్షణమే సాయం మంజూరైందని రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



తెర్లాం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధుసూదనరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని విజయరాంపురం(బూరిపేట) సర్పంచ్ బూరి మధుసూదనరావును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. ఇటీవల ఆయనకు గుండెపోటు రావడంతో వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం విజయనగరం వెళ్లి, అతడి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మాదాసు శేషగిరి, సుందరాడ సర్పంచ్ అద్దంకి దిలీప్కుమార్ తదితరులు ఉన్నారు.



రాజాం: దాలినాయుడును పరామర్శిస్తున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్

రాజాం: మండలంలోని శ్యాంపురానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దువ్వి దాలినాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం కలిసి, పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై, పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం గ్రామంలోని ఇంటికి వచ్చి కోలుకుంటున్న ఆయనను కలిసి, ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులను కలిసి, రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముళ్ల చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తెర్లాం: బొండపల్లి తహసీల్దార్ రమణయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని వీఆర్వోల సంఘం నాయకుడు సువ్వాడ నరసింహనాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన భూ వివాదాల కారణంగా తహసీల్దార్ను దుండగులు హత్య చేయడం దారుణమన్నారు. ఈ దుర్ఘటనను వీఆర్వోల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. నిందితులను త్వరగా పట్టుకుని, అరెస్ట్ చేయాలన్నారు. తహసీల్దార్లకు ప్రభుత్వం మరింత రక్షణ కల్పిస్తూ భరోసానివ్వాలన్నారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్చార్జ్ నాగరాజు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని, వాటిని తినడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారయ్యే జిల్లేడు కషాయంతో పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని, పత్రద్రావణం, తూటాకు కషాయంతో వరి పంటలో దోమపోటును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు లక్షుంనాయుడు, వరలక్ష్మి, రవి, తదితరులు పాల్గొన్నారు.

మేధస్సు వెలికితీతకు పోటీలు దోహదం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఏపీపీఎస్టీఎఫ్ సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థుల్లో దాగిఉన్న మేధస్సును వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీపీఎస్టీఎఫ్(ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం) ఆధ్వర్యంలో మండల స్థాయి మేథోత్సవం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా తెలియని విషయాలను చర్చించుకోవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందన్నారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలకు 26 మంది హాజరై, ప్రతిభ కనబరిచారు. ఇంగ్లిష్ మీడియంకు సంబంధించి, జె.సురేష్ (జెడ్పీహెచ్ఎస్, పొగిరి), ఎ.సుబ్రహ్మణ్యం(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), జె.సాయివర్ధన్(జెడ్పీహెచ్ఎస్, కంచరాం)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని, తెలుగు మీడియానికి సంబంధించి, వై.లావణ్య (జెడ్పీహెచ్ఎస్, రాజాం), వి.అంజుశ్రీ(జెడ్పీహెచ్ఎస్, దోసరి), టి.ద్రాక్షాయని(జెడ్పీహెచ్ఎస్, బొద్దాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని, వీరంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం సభ్యులు సర్టిఫికెట్లు అందించి, అభినందించారు.

కేన్సర్పై అవగాహన కలిగి ఉండాలి



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ కేన్సర్పై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్లో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తప్పనిసరిగా మార్చుకోవాల్సిన అలవాట్లు మార్చుకోవాలన్నారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండి, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వారంలో రెండుసార్లు చేపలు తినడం ద్వారా కేన్సర్ బారిన పడకుండా ఉండొచ్చన్నారు. అనంతరం బొబ్బిలి రోడ్డులో కేన్సర్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పక్కనే వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ తలే రాజేష్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మండలంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశమైన వారు ప్రతీ గ్రామంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని, బూత్ కన్వీనర్లకు ఎన్నికల గెలుపు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఇంటికి తెలియజేయాలన్నారు. సీఎం జగన్మోహన్రెడ్డి పారదర్శకంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న తీరు, పాలనలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. పార్టీ, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతీఒక్కరి ఓటు పార్టీకి పడేలా చూడాలన్నారు. మరో మూడు నెలలు కష్టపడితే అధికారం మళ్లీ మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని, అహర్నిశలు శ్రమించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్కుమార్, యూత్ కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

25 మద్యంసీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని జాడపేట గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 25 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, విక్రేతపై కేసు నమోదు చేశామన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఇల్లు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో దేశాబత్తుల చిరంజీవి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో ప్రాణాపాయం తప్పింది. గర్భిణి అయిన తన భార్యను వైద్య తనిఖీల కోసం దగ్గరలోని ఆస్పత్రికి చిరంజీవి తీసుకువెళ్లి, వచ్చేసరికి ఈ ఘటన జరిగి, ఇంట్లో ఉన్న సామగ్రి అంతా కాలిపోయింది. ఈ సమాచారం అందుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. మండలంలోని పిట్టాడలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అక్కడి నుంచి సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదంపై ఆరాతీశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. తహసీల్దార్తో మాట్లాడి, బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం రేపు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గొడ వీధిలో ఉన్న అభ్యుదయ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 6వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చింత శారద ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స, మందులు అందజేయనున్నారన్నారు.

ప్రైవేట్ పాఠశాలల జిల్లా కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

రాజాం: ప్రైవేట్ పాఠశాలల జిల్లా కమిటీ అధ్యక్షుడిగా రాజాం విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ గట్టి పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను మండల కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల సిబ్బంది ఆదివారం అభినందించారు. కమిటీ కార్యదర్శిగా కె.ఎల్లరావు, కోశాధికారిగా వై.కాశినాయుడు, ఉపాధ్యక్షులుగా బి.ఈశ్వరరావు, గణేష్, సహాయ కార్యదర్శులుగా పి.దుర్గాభవానీ, వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.